# ప్రధాన ఉపాధ్యాయుడు - మానవీయ దృక్పథాలు

# The Headmaster - Humanistic Perspectives


## Author

Dr. S. Vijay Kumar
Former DEO & Professor, Dept. of Maths & Science
SCERT, Telangana

## Editor

Dr. S. Suresh Babu, Consultant,
School Leadership Academy
S.C.E.R.T. Telangana, Hyderabad



2023-24

స్కూల్ లీడర్‌షిప్ అకాడమి
ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్,
ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL – NIEPA), న్యూఢిల్లీ

## విషయం

1. పరిచయం
2. లక్ష్యాలు
3. భావనలు
4. ఏది అసలైన నాయకత్వం
5. ప్రధాన ఉపాధ్యాయుడుగా బాధ్యతలు చేపట్టినపుడు కొన్ని ప్రతిపాదనలు ముందుంచుకోవాలి

## 1. పరిచయం:

ముందుగా ఈ మాడ్యూల్ ను........ ఈ ప్రశ్నకు జవాబును వెతికి పట్టుకొన గల్గితే అసలు సమస్యలే ఉండవనుకుంటాను. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రధాన ఉపాధ్యాయుడు గా ఏ విధమైన లక్షణాలు కలిగి వుండాలి? ఎలా వ్యవహరించాలి? అన్న అంశాలతో పాటు విజయ వంతంగా, ఫలవంతంగా తన విధిని నిర్వర్తించడానికి అనుభవ పూర్వకమైన సంఘటనల ఆధారంగా కొన్ని వ్యూహాలను వివరించడం జరిగింది.

## 2. లక్ష్యాలు:

ఈ మాడ్యూల్ ద్వారా ప్రధాన ఉపాధ్యాయుడు. నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవడానికి నిర్దిష్ట మైన లక్ష్యాలను ఎంపిక చేయడం జరిగింది.

1. ప్రధాన ఉపాధ్యాయుడు గా పాఠశాలలో తన స్థానాన్ని, పాత్రను గుర్తించుట.
2. సమ కాలీన పరిస్థితుల్లో నాయకత్వం అర్థాన్ని, స్వభావాన్ని అవగాహన చేసుకొనుట.
3. 'గెలుపు, గెలుపు సూత్రం' దృక్పథాన్ని పెంపొందించుకొనుట.
4. రోల్ మోడల్ గా ఉండాల్సిన భాద్యతను గుర్తెరుగుట.
5. వ్యక్తిగత ఈగో కంటే వ్యవస్థ బాగుకు ప్రాధాన్యతనిచ్చుట.
6. ప్రశంసించె మనస్తత్వాన్ని అలవరచుకొనుట.

## 2. భావనలు

- స్వయం క్రమశిక్షణ, ఋజువర్తన, ఆచరణ సహచర సిబ్బందిలో ప్రేరణ కలిగించడంలో ప్రధానభూమికను పోషిస్తాయి.

- తోటి ఉపాధ్యాయుల బలాలను, బలహీనతల్ని, ప్రతిభను గుర్తించడం, వారికి ఆయా పనులను అప్పగించి ప్రోత్సహించడం వల్ల పాఠశాలలో చేపట్టే వివిధ కార్యక్రమాలు విజయ వంతం అవుతాయి.
- కర్తవ్య నిర్వహణలో స్వతంత్రంగా పనిచేయడం లేదా ఇతరులపై పూర్తిగా ఆధార పడడం కాకుండా పరస్పర ఆధారిత విధానాన్ని అవలంబించడం వల్ల వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది.

**ముందుగా ఈ మాడ్యుల్‌ను నాతో జరిగిన ఒక సంభాషణతో మొదలెట్టా నుకుంటున్నను.**

మహబూబ్ నగర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ లో కొంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేసే వారు. హైదరాబాదు వరకు రైల్లో ప్రయాణం చేసేటప్పుడు వారితో కలిసే వాడిని. ఆ సందర్భంగా ప్రతిసారి దాదాపుగా వాళ్ల' హెడ్ ' గురించి మాట్లాడే వాళ్ళు. చాలా వరకు ఆయన బాసిజం గురించి - ఆయన ఒక్కడి వల్లే పీ. జీ సెంటర్ నడుస్తున్నట్లు బిల్డ్ అప్ ఇస్తాడని, ఆయనొక్కడికే కళాశాల బాగోగులు, విద్యార్థుల చదువుల గురించి పట్టింపు ఉన్నట్లు మాట్లాడుతాడని, మిగతా వాళ్లందరినీ పని ఎగ్గొట్టే వాళ్ళుగా భావిస్తాడని, ప్రతి దానికి కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తాడని, ఇంకా వాళ్ళు ఎంత కష్టపడ్డా గుర్తింపు ఉండదని, ఇలా... ఎన్నెన్నో మాట్లాడటం వింటుందడేవాడిని.

కొన్ని నెలల తర్వాత అప్పుడున్న హెడ్ స్థానంలో ఒకానొక అసిస్టెంట్ ప్రొఫెసర్ నియమించబడ్డాడు. అతనితో కలిసినపుడు ఆయన మాటలు వింటే ఆశ్చర్యం కలిగింది. సహచర ఉపన్యాసకులకు ఎవరికి టైమ్ సెన్స్ లేదని, ఎప్పుడు ఎదో ఒక వంకతో పని ఎగ్గొట్టడానికి చూస్తారని నెల నెలా వేలల్లో జీతాలు తీసుకుంటూ ఊరికే కూర్చుంటారని,విద్యార్థులకు పాఠాలు భోదించాలన్న కనీస భాద్యతలు కూడా లేవని, ఏ చిన్న పని చెప్పినా ఏదో భారం తలపై మొస్తున్నట్లు ఫీలవుతారని చెప్పుకొచ్చాడు. మొన్నటి దాకా తన హెడ్ పై కారాలు మిరియాలు నూరిన మనిషి, దెప్పి పొడిచిన మనిషి ఇతడేనా తన క్రింది వాళ్ళ గురించి ఇలా మాట్లాడుతున్నది అన్పించింది. ఒక్క సారి' హెడ్' సీట్ లో కూర్చున్నాక మొత్తం సీన్ రివర్స్ అయ్యింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీనియార్టీ ఆధారంగా సీనియర్ ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి పొందుతాడు. అంతే కానీ ప్రతిభ ఆధారంగా హెచ్. ఎం. గా నియమించబడడు. ఎన్నో ఏండ్లుగా ఉపాధ్యాయుడుగా ఎంతో మంది ప్రధానోపాధ్యాయుల దగ్గరపనిచేసిన వ్యక్తిగా, ఎంతో అనుభవాన్ని గడించిన వాడిగా ఉన్న తాను ప్రధానోపద్యాయుడిగా బాధ్యతల్ని అప్పగించినప్పుడు చాలా చక్కగా పనిచేసే అవకాశం ఉంటుంది. ఎందుకంటే తను ఒక ఉపాధ్యాయుడిగా హెచ్. ఎం. ల కిచ్చిన గౌరవం, గుర్తింపు, సహకారం, మానవ సంబంధాలు, తోటి ఉపాధ్యాయులతో కలసి పని చేసిన తీరు, ఇవన్ని ప్రధానోపాధ్యాయుడిగా పని చేసేటప్పుడు సహాయపడుతాయి. అంతే కాకుండా

చాలా సార్లు హెచ్. ఎం. ఇలా పనిచేస్తే బాగుంటుందని, అలా చెబితే బాగుండేదని, ఈ పని చేయాల్సింది కాదని అనుకోని వుండి వుంటారు. మరి తాను హెచ్. ఎం. ఆయిన తర్వాత ఆ రకంగా ప్రవర్తించకపోతే సరిపోతుంది కదా! సమస్య ఎక్కడ ఉంది? సీటుపై కూర్చున్నాక అలా ఉండరెందుకని? ఈ ప్రశ్నకు జవాబును వెతికి పట్టుకొనగల్గితే అసలు సమస్యలే ఉండవనుకుంటాను.

స్వాతంత్రోద్యమ కాలంలో సర్ జగదీష్ చంద్ర బోస్ కలకత్తా యూనివర్సిటీ పరిధిలోని ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రొఫెసర్ గా పనిచేశాడు. ఆ సమయంలో ప్రతిభ ఆధారంగా పదోన్నతులు ఉండేవి. ఆయన గొప్ప శాస్త్రవేత్త, పరిశోధకుడు, మేధావి కావడం వల్ల ఆయన పని చేసే శాఖకు హెడ్ గా ప్రమోట్ చేశారు. వయసులో ఇతర ప్రొఫెసర్ల కంటే చిన్నవాడు, తమ కంటే జూనియర్ కు హెడ్ షిప్ రావడం ఒక సీనియర్ ప్రొఫెసర్ కు నచ్చలేదు. జూనియర్ కింద తను పని చేయడమేమిటని అక్కసుతో ఉండేవాడు. సరిగా క్లాసులకు కూడా వెళ్ళే వాడు కాదు. బోస్ కు ఎదురుగా వస్తే ఎక్కడ " విష్ ' చేయ వలసి వస్తుందనుకొని ఎక్కువ సమయం డిపార్ట్ మెంటులోనో, ల్యాబ్ లోనో గడిపే వాడు. ఏ మాత్రం అవకాశం చిక్కినా బోస్ తో గొడవ పడాలని నిశ్చయించు కున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

బోస్ పై తనలో రగులుతున్న కోపాన్ని, పగను తీర్చుకునే సందర్భం రావడం లేదు. ఇక తనే ఏదో ఒకటి చేయాలని భావించి పీరియడ్ లకు ఆలస్యంగా వెళ్ళాలని, ముందుగానే క్లాస్ నుండి బయటకు వచ్చేయాలని అలాగయితే బోస్ తనను పిలిచి కారణం అడిగినప్పుడు ఆయనతో వాగ్వివాదానికి దిగ వచ్చనుకున్నాడు. ఒక రోజు బోస్ చూస్తుండగానే బెల్ మ్రోగినా క్లాస్ కు వెళ్ళలేదు. బోస్ ఏమీ అనకుండా వెళ్ళిపోయాడు. మరుసటి రోజు కాస్తా ఆలస్యంగా వెళ్ళాడు. బోస్ కు ఈ విషయం తెలిసింది. కాని ఏమి అనలేదు. ఈ విధంగా ఒక వారం రోజులు వరుసగా తను అనుకున్నట్లు చేశాడు. అయినా బోస్ ఏమీ అడగక పోవడంతో ఈ మనిషి తనను పిలవడని, ఏమీ పట్టనట్లు ఉన్నాడని గుర్తెరిగి తనే రెగ్యులర్ గా క్లాస్ లకు వెళ్ళడం ఆరంభించాడు. ఒక్కోసారి మౌనం వహించడం వల్ల కూడా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అర్థ మవుతుంది.

పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయుడు ఎదుర్కొనే అనేక సమస్యలకు ఒకే ఒక పరిష్కార మార్గం అంటూ ఉండదు. కొన్నిసార్లు నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా ఉండాలి. మరి కొన్ని సందర్భాల్లో వెసలు బాటును, స్వేచ్ఛ నివ్వాలి. పట్టు విడుపు లుండాలి. అంతే గాని తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళన్న ఛాందస వాదాన్ని విడనాడాలి. పలు మార్లు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇలా వుండాలి, అలా ఉండ కూడదు, ఇలా చేయాలి, అలా చేయకూడదు అని చెప్పి విసిగించడం కన్న దాన్ని తాను అమలు పరిస్తే, ఆచరిస్తే ఎంతో ప్రయోజనకారిగా, ఉపయుక్తంగా ఉండటమే కాక ఎదుటి వారిలో నైతిక పరమైన ఒత్తిడిని కలుగజేసి ఆచరణలో పెట్టడానికి మానసికంగా సిద్ధమయ్యేట్లు చేస్తుంది.

ఈ సందర్భంగా నాకొక హెచ్. ఎం. చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఒక ఉన్నత పాఠశాలలో కొత్తగా చేరిన హెచ్. ఎం. కు అక్కడ పనిచేసే ఉపాధ్యాయుల వ్యవహారం వింతగా కన్పించింది. పీరియడ్ బెల్ మోగిన తర్వాత కూడా స్టాఫ్ రూంలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడం, నింపాదిగా తరగతి గదులకు వెళ్ళడం, ఒక్కోసారి వెళ్ళ కుండా టైం పాస్ చేయడం , విద్యార్థులు అల్లరి చేస్తున్న పట్టించుకోక పోవడం ...., ఇలా నిత్యం కొనసాగేది. హెచ్. ఎం. ఎన్ని సార్లు స్టాఫ్ మీటింగ్ లో గుర్తు చేసినా, స్టాఫ్ రూమ్ లోకి వెళ్ళి మందలించినా మార్పు రాకపోవడం అటుంచి ఆయనపై ఎదురు దాడికి దిగడం - ఊరికే మా వెంట పడతారెందుకని అనడం, మాకు ఎప్పుడు క్లాస్ కు వెళ్లాలావెళ్ళాలో తెలియదా అని నిలదీయడం, ఇలాంటి హెచ్. ఎం. ను మిమ్మల్నే చూస్తున్నా మంటూ దేప్పి పొడవడం చేస్తున్నారు. విసిగిపోయిన ఆ హెచ్. ఎం. ఓ రోజు పాఠశాల ఆరంభమైన మొదటి గంట తర్వాత లాంగ్ బెల్ (విద్యార్థులు ఇంటికి వెళ్లేప్పుడు కొట్టే) కొట్టించాడు. అది విన్న విద్యార్థులందరు బ్యాగులు సర్దుకొని పాఠశాలకు సెలవిచ్చారనుకొని ఇళ్లకు వెళ్లి పోయారు.

హడావుడిగా ఉపాధ్యాయులు అందరు హెచ్. ఎం. గదికి చేరుకొని ఆయన్ని ఎందుకు అలా చేశావని అడిగారు. మీరు ఎంత చెప్పినా క్లాసెస్ కు టైం కు వెళ్ళడం లేదని అందుకు పిల్లల్ని వదిలి వేస్తే వారి తల్లదండ్రులు వచ్చి అడుగుతారని , అప్పుడు వారికి మీరే జవాబు చెప్పాలని వివరణ ఇచ్చాడు. మీకు కూడా చెడ్డ పేరు వస్తుందని దాన్ని మీరు మరచి పోతున్నారని హెచ్. ఎం. ను ప్రశ్నించారు. ఉన్న వాస్తవాన్ని వాళ్లకు చెప్పడానికి సిద్ధమయినట్లు బదులిచ్చాడు. వాదోపవాదాలు జరుగుతున్న సమయంలోనే స్కూల్ బయట ఉన్న కొంత మంది యువకులు హెచ్. ఎం. దగ్గరికి వచ్చి పాఠశాలను ఎందుకు వదిలి వేశారని అడిగారు. దానికి హెచ్. ఎం ఇవేమీ చెప్పకుండా అత్యవసరంగా పాఠశాల విషయంలో టీచర్లతో సమావేశంను ఏర్పాటు చేయవలసి వచ్చిందని, విద్యార్థులు తరగతుల్లో ఖాళీగా కూర్చోవడం, అల్లరి చేయడం ఎందుకని పాఠశాలను వదిలినట్లు చెప్పాడు. దానితో సంతృప్తిచెందిన యువకులు బయటకు వెళ్లి పోయారు. ఉపాధ్యాయులంతా ఊపిరి పీల్చుకున్నారు. హెచ్.ఎం. పాఠశాల పరువుని నిలబెట్టాడని, తమ గౌరవాన్ని కాపాడాడని చెబుతూ, మేము క్రమం తప్పకుండా క్లాసులకు వెళ్తామని హెచ్. ఎం.కు హామీ ఇచ్చారు. ఈ విధంగా సమస్య పరిష్కార మవడంతో హెచ్. ఎం. కు ఆనందమనిపించింది.

ప్రధానంగా ఉన్నత పాఠశాలలో చాలా మంది ఉపాధ్యాయులు పనిచేస్తూ ఉంటారు. ఉపాధ్యాయు లందరూ ఒకే రకంగా ఉండరు. కొంత మంది తామంతట తాముగా మంచిగా పనిచేసుకుంటూ డ్యూటీ మైండ్ తో ఉంటారు. ఒకరిద్దరు పేచీ పెడుతుంటారు. హెచ్. ఎం. గా సక్సెస్ అవ్వాలంటే ఏ టీచర్ ఎలాంటి వాడో తెలుసుకొంటూ సమస్యల్ని చలాకీగా పరిష్కరించుకుంటు ముందు కెళ్ళాలి. ఒక సారి ఒక హెచ్. ఎం. తో మాట్లాడుతున్నప్పుడు వివాదాస్పదుడిగా, మొండిగా ఉన్న ఉపాధ్యాయుడిని ఏ విధంగా

డీల్ చేసింది చెప్పుకొచ్చాడు. ఆయన హెచ్. ఎం. గా ఉన్న స్కూల్లో ఒక టీచర్ సమస్యలు సృష్టించడంలో కేరాఫ్ అడ్రస్ ఉంటుండే వాడు. స్టాఫ్ రూమ్ లో ఉన్నపుడు ఏదో ఒక విషయంలో, ఎవరో ఒక టీచర్‌తో గొడవ పెట్టుకునేవాడు. క్లాస్ రూంలోకి వెళ్ళినా విద్యార్థులతో తగవులు పడే వరకు వెళ్ళేవాడు. వారంలో ఒక రోజైనా హెచ్. ఎం. కు తలనొప్పి తప్పేది కాదు.సమస్యల్ని ఎలా పరిష్కరించాలన్న విషయంలో హెచ్.ఎం. కు తల బాదుకునేంత పనయ్యేది. పాఠశాల వేలల్లో ఎక్కువ సమయం తన దగ్గర కూర్చొబెట్టుకోవాలని, ఏం జరుగుతుందో చూడాలని అనుకున్నాడు. ఆ ఉపాధ్యాయుడిని రోజంతా తన ఛాంబర్లోనే (ఎదో ఒకటి మాట్లాడుతూ) ఉండేట్లు చూశాడు. మరునాడు కూడా తన దగ్గరే కూర్చోమని చెప్పాడు. ఆ ఉపాధ్యాయుడు నేను స్టాఫ్ రూమ్ కి వేళతానంటే, ఇక్కడే కూర్చో బాగుంటుందన్నాడు. అలాగే తన క్లాస్ కు పోతానంటే పర్వాలేదు కూర్చో మన్నడు. అలా రెండు రోజులు గడిచే సరికి ఆయనకు పిచ్చెక్కి నంత పనయ్యింది. తనను హెచ్. ఎం. అతని రూమ్ లో ఎందుకు కూర్చో బెట్టాడో అర్థమయ్యింది. సార్ నన్ను విడిచి పెట్టండి. బుద్దిగా ఏ గొడవ లేకుండా స్టాఫ్ రూమ్ లోనే ఉంటానని, క్లాసుల్లో కూడా నా నుంచి ఏ తగవులు రాకుండా చూస్తానని హెచ్. ఎం. కు హామీ ఇచ్చి బయట పడ్డాడట.

## 4. ఏది అసలైన నాయకత్వం?

నేనుంటేనే పనులు జరుగుతాయి. ప్రతి దానికి వెంట పడితేనే తప్ప పనులు కావు, అని చెప్పే నాయకత్వం అసలైన నాయకత్వం అనిపించుకోదు. ఈ సందర్భంగా నేను చదివిన ఒక సంఘటన మీ ముందు ఉంచుతున్నాను.

చిన్న వయసు లోనే ఐ. ఏ. ఎస్. కు ఎంపికై కలెక్టర్ గా ఒక జిల్లాకు నియమించబడ్డాడు.

ఆయన చాలా చక్కగా పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని, అలాగే తన దంటూ ఒక ముద్ర వేసి పోవాలని ఉవ్విళ్లూ రుతుండే వాడు. అలాగే చేయడం ఆరంభించాడు కూడా. అయితే ఆయనకింకా పెళ్ళి కాలేదు. పెళ్ళికై పది రోజులు సెలవుపై వెళ్లాల్సి వచ్చింది.

జిల్లాలో పరిపాలన కుంటుపడుతుందేమోనన్న దిగులున్నా వెళ్లక తప్పలేదు. పెళ్లికి 10 రోజులు మాత్రమె కాకుండా హనీమూన్ కని మరో 15 రోజులు సెలవు పెట్ట వలసి వచ్చింది. చాలా రోజుల తర్వాత జిల్లాకు వెలుతుండడం వల్ల అక్కడి పరిస్థితులు ఏమై పోయాయో తెలుసుకోవాలన్న ఆత్రుత ఎక్కువయ్యింది. అక్కడ పనిచేస్తున్న అటెండర్ తో నేను లేనప్పుడు పనులు ఎలా జరిగాయని అడిగాడు. అటెండర్ బదులిస్తూ బాగానే జరిగాయి అన్నాడు. అంటే అర్థం కాలేదని యువ కలెక్టర్ అన్నాడు. దానికి అటెండర్ మీరు ఉన్నప్పుడు ఎలా జరిగాయో, మీరు లేనప్పుడు కూడా అలాగే జరిగాయని బదులివ్వడంతో కలెక్టర్ కు జ్ఞానోదయం అయినంత పని అయ్యింది. అప్పుడు కాని ఆయనకు అసలు సిసలైన నాయకత్వం అంటే ఏమిటో అర్థం కాలేదు. తను లేకపోయినా యథావిధిగా ఎవరి పనులు వారు

చేసుకుపోయేటట్లు చేయడమే కదా నాయకత్వమంటే నేనుంటేనే పనులు చేస్తారనుకోవడం తప్పు అనుకున్నాడు. అంటే ప్రజాస్వామ్య యుతమైన పాలన నిజమైన నాయకత్వానికి పునాది.

పాఠశాల విషయానికొస్తే ఉపాధ్యాయులలో ఒకో రంగంలో ఒకరికి ప్రత్యేకమైన పరిజ్ఞానం, అనుభవం ఉంటుంది. ఉదాహరణకి ఒకరికి కంప్యూటర్ పై పట్టు ఉంటే మరొకరికి ప్రజా సంబంధాల విషయంలో అనుభవం ఉంటుంది. ఒకరికి విద్యార్థుల తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంలో మెళకువలు తెలిసి ఉంటే మరొకరు స్కూల్ గార్డెనింగ్ లో నిష్ణాతులై ఉండవచ్చు. పాఠశాలలో జరిగే వివిధ కార్యమాలను చక్కగా నిర్వహించడంలో ప్రతిభను కలిగియున్న వారు మరొకరు ఉండవచ్చు. ప్రధానోపాధ్యాయుడుగా తన ముందున్న నిర్దిష్ట మైన లక్ష్యాలను- విద్యార్థులలో సర్వతోముఖాభివృద్ధి (శారీరక, మానసిక, భావోద్వేగ, నైతిక, ఆధ్యాత్మిక రంగాల్లో) సాధించుట, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, విద్యార్థుల తల్లి తండ్రులతో, పాఠశాల యాజమాన్యంతో, సమాజ పెద్దలతో కలిసిపనిచేయుట, ఇంకా రోజు వారిగా కూడా - విద్యార్థుల హాజరి, విద్యా ప్రగతి, మధ్యాహ్నం భోజనం నిర్వహణ, కాలనిర్ణయ పట్టిక అమలుపరచుట వంటివి. సక్రమంగా, విజయవంతంగా అమలవడానికి సరిఅయిన ఉపాధ్యాయులను వారి యొక్క పరిజ్ఞానం, అనుభవాలను బట్టి ఎంపిక చేసుకొని వారికి ఆయా భాద్యతలను అప్పగించి, దిశా నిర్దేశనం చేయడం , ప్రోత్సహించడం వల్ల సులభంగా, దిగ్విజయంగా కార్యక్రమాలు జరుగుతాయి. సూక్ష్మంగా చెప్పాలంటే సరియైన వ్యక్తిని, సరైన స్థానంలో ఉంచి వారికి నాయకత్వం వహిస్తే సకాలంలో, సవ్యంగా పనులు పూర్తవుతాయి.

ఒక్కడిగా కంటే జట్టుగా ముందుకెళ్ళడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్న విషయాన్ని ప్రధాన ఉపాధ్యాయుడు గుర్తెరగాలి. ఆ దిశగా ప్రతీ పనిని చేపట్టాలి. తనకు తానుగా పనిచేయటం సులభం కాని ఇతరులచే ఆ స్థాయిలో పని చేయించడం చాలా కష్టం. ప్రధాన ఉపాధ్యాయుడు ముందుండే అసలైన పరీక్ష ఇదే. గుర్రాన్ని నీళ్ళ వరకు తీసుకు వెళ్ళవచ్చు కాని దానిచే నీళ్ళను త్రాగించడం మన వల్ల అయ్యే పని కాదన్న సత్యం ఈ సందర్భంగా గుర్తుకువస్తుంది. పాఠశాలలోని ఉపాధ్యాయులు ఎవరికి వారు వారి వారి పనులను చేయడానికి తగిన విధంగా ప్రేరణ కలిగిస్తూ, ఉత్సాహాన్ని నింపుతూ కార్యోన్ముకుని చేయాలి. నాయకత్వమంటే..., తను ఎదగడం, తన అధికారం/పెత్తనం కొనసాగడం, తను చెప్పినట్లే వినడం, తన మాటే నెగ్గించుకోవడం, తన కనుసన్నలలో నడవడం, అన్నీ తానై ఉండడం కాదు. తన బృందంలోని, అనుచరుల్లోని, ప్రతిభను, ప్రత్యేకతలను వెతికి, గుర్తించి, వెలికితీయడం. వారు ఎదిగేందుకు సహకరిస్తు, ప్రోత్సాహాన్ని అందిస్తూ, తగిన గుర్తింపును, గౌరవాన్ని ఇస్తూ, వారికే పెద్ద పీఠ వేయడమే అసలు సిసలైన నాయకత్వం.

నిజానికి నాయకత్వానికి ఈ అర్థం అంటూ ఒకటుంటుందా అని ఆశ్చర్యమేస్తుంది. ఎందుకంటే మనలో చాలా మందికి తెలిసిన అర్థం - నాయకుడే సర్వస్వం. నాయకుడంటే కర్త, కర్మ, క్రియయని.

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మాటల్లో' నాయకులు చెసే అతి పెద్ద తప్పిదం ఎలా ఇతరులపై పెత్తనం చెలాయించాలి అని అనుకోవడమే. దాని వల్ల తన సహచరులతో ఎప్పటికి సత్సంబంధాలు బలంగా ఏర్పడవు. దానితో వ్యవస్థ అవసరాల్లో, కష్టాల్లో, ఇబ్బందుల్లో వారి భాగస్వామ్యం ఆశించినంతగా ఉండదు. తద్భిన్నంగా సహచరులను కలుపుకొని వెళుతూ, వారికి సాధికారతను కల్పిస్తూ, వారి గెలుపునకు సాయం చేస్తూ, గెలుపు - గెలుపు వైఖరితో ముందుకెలితే నీ నాయకత్వం వారికి నచ్చుతుంది ఎందు కంటే వాళ్ల విజయం వెనకాల నీ పెట్టుబడి, కృషి, తోడ్పాటు ఉన్నాయి'. చాలా మంది ప్రధాన ఉపాధ్యాయులలో/నాయకులలో తన దగ్గర పనిచేసే సిబ్బందితో స్నేహంగా, ప్రేమగా ఉండటం వల్ల భుజాన కెక్కుతారని, చులకనగా, తేలికగా చూస్తారనే ధృఢమైన అభిప్రాయాలున్నాయి. వారిని వీలయినంత దూరంలో ఉంచడం మంచిదని, ఖచ్చితంగా వ్యవహరించడం వల్ల మాత్రమే ఫలితం ఉంటుందని విశ్వసించే వారున్నారు. ఈ రెండూ కూడా కొంత వరకు సరియైనవి .అయితే, పూర్తిగా మాత్రం వాస్తవం కాదు. ఎలా వుండాలి? ఏ మేరకు వుండాలి? అన్న విషయంలో కొలబద్ద ఏది లేదు. అయా పరిస్థితులు, అవసరాలను బట్టి ప్రధానోపాధ్యాయుడు నిర్ణయాలు తీసుకోవల్సి ఉంటుంది. మొత్తంగా పాఠశాలలో చేపట్టే వివిధ కార్యక్రమాలు విజయ వంతంగా నిర్వహించబడడం, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు రావడం, మన్నది ఉపాధ్యాయులు మరియు ప్రధాన ఉపాధ్యాయుడు ఒక జట్టుగా కలసి పని చేసినప్పుడే సాధ్యమవుతుంది. ఇది సాకారమవ్వాలంటే పాఠశాల ఆధినాయకుడుగా పూర్తి బాధ్యత ప్రధాన ఉపాధ్యాయుడుపై ఉన్నది. అతని దార్శనికత, నిబద్ధత, కార్యదీక్షత, నిర్భయత్వం, సాహసం, కలుపుగోలుతనం, క్రమశిక్షణ, పట్టు విడుపు స్వభావం, ప్రణాళిక రచన - అమలులో ఖచ్చితత్వం, పరస్పర విశ్వాసం, ప్రసంశించే మనస్తత్వం, నిష్పక్షపాతదోరని, నేర్పరితనం పాఠశాల ఉన్నతిని, అభివృద్ధిని, ఔన్నత్యాన్ని చాటడంలో ప్రధాన భూమికను పోషిస్తాయన్న సంగతిని మరవరాదు.

పాఠశాలల్లో పని చేస్తున్న చాలా మంది ప్రధాన ఉపాధ్యాయులు ఆ మాటకొస్తే వివిధ శాఖలకు నేతృత్వం వహిస్తున్న శాఖాధి పతులు వారి క్రింద పనిచేస్తున్న సిబ్బంది గురించి తరచుగా చెప్పే మాటలు ఒకేలా ఉంటాయి. ఉదాహరణకు వారంతా పనిచేయడానికి ఇష్టపడరని, వీలుచిక్కినప్పుడల్లా పని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తారని, టైం సెన్స్ అసలుండదని, ఏ మాత్రం బాధ్యత తీసుకోరని, ఎప్పుడూ ఎదో కోల్పోయి నట్లుగా మొఖాలు పెడతారని, ఒకరంటే మరొకరికి పడదని, చిన్న చిన్న విషయాల్లో గొడవ పడతారని.... అంటుంటారు.

ఎంత చెప్పినా వారు మారరని, చివరికి ఆ దేవుడు కూడా వాళ్ళని మార్చలేడని ఖరా ఖండిగా తెల్చేస్తారు. అలా వారు మాట్లాడినప్పుడు వింటే అవును నిజమే కదా అని అనిపించడంతో పాటుగా డ్యూటీ గురించి వారెంతగానో ఫీల్ అవుతున్నారని భావిస్థాం. అయితే ఎంత సేపు వాళ్ళు ఎదుటి వాళ్ళ గురించి మాత్రమే చెబుతున్నారన్న చిన్న లాజిక్ ను మిస్సవుతాం.

**ఇక్కడ మీకు నేను చదివిన ఒక కథను చెప్పాలను కుంటున్నాను.**

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వాణికి మంచి సంబంధం దొరకడంతో ఆమె తల్లితండ్రులు వెంటనే పెళ్ళి చేశారు. పెళ్లయిన వారం రోజులకే అత్తగారితో తగవులు మొదలయ్యాయి. దీపావళికి పుట్టింటికి వచ్చిన వాణి వాళ్ళింట్లో అక్కడ జరిగిన విషయాల్ని- తెల్లవారుఝామునే నిద్ర లేచి ఇంటి పనులు చేసుకోవా లంటుందని, పరిశుభ్రంగా ఉంచుకోవాలంటు వెనకాలే తిరుగుతుంటుందని... ఏకరువు పెట్టింది. వాళ్ళ అమ్మ నాన్న కూతరుతో కొత్తలో ఇలాంటివన్నీ మామూలేనని సర్దుకుపోవాలని నచ్చ జెప్పారు. మళ్ళీ అత్తారింటికి వెళ్ళిన మూడవ రోజు నుండే  యుద్ధం  మొదలయ్యింది. మొదట ఆమే మౌనంగా ఉన్నా తర్వాత  మాటకు మాట బదులిచ్చేది. మరింతగా గొడవలు పెరగడంతో అలిగి పుట్టింటికి వచ్చింది. ఈ సారి వాళ్ళ ఇంటిలో ఎంత సర్దిచెప్పాలని ప్రయత్నం చేసినా వినలేదు సరికదా వాళ్ళ అత్త గారు బతికి ఉన్నంత వరకు ఆ కడప తొక్కనని భీష్మించుకు కూచుంది. రోజులు గడుస్తున్నాయి. వాణి భర్తను చూస్తే అతడు చాలా మంచివాడు. ఇలాగే ఇంకొంత కాలం కొనసాగితే సమస్య విడాకుల వరకు వెళుతుందని భయపడ్డారు.

ఎందుకో తెలియదు కానీ భర్తకు దూరమవుతానన్న బెంగతోనో లేక అత్త గారి వేదింపులు తలుచు కోవడం వల్లనో వాణి ఆరోగ్యం క్షీణింప సాగింది. వాణి తండ్రి ఈ సమస్యకు పరిష్కారం లేదా ఏమి చేద్దామని కూతురిని అడిగాడు. అత్త గారు బతి కున్నంత వరకు వెళ్ళ లేనంది. అత్త గారు చస్తే గాని పీడ విరుగడ అవదని, ఆమెను ఎలాగైన వదిలించు కోవాలనే నిర్ణయానికి వచ్చింది వాణి. వాళ్ళ నాన్నను నీవు అర్. ఎం. పి. వి కదా ఏదైనా  ఇంత విషమివ్వు ముసలి దానికిచ్చి నేను హాయిగా కాపురం చేసుకోగల్గు తానని అడిగింది. కూతురు బాధను చూసి కాదనలేకపోయాడు. అయితే ఒకేసారి విషమిచ్చి చంపితే అనుమానం వస్తుందని అలా కాకుండా 'స్లో పాయిజన్' ఇద్దామని, పని పూర్తవడానికి ఒక నెల పడుతుందని, రోజు కొంచెం కొంచెంగా పాలలో లేదా అన్నంలో కలిపి ఇవ్వవలసి వుంటుందన్నాడు. దానికి ఆమె సరేనంది. ఎలాగో ముసలది చనిపోతుంది కనక ఆ నెల రోజులు ఆవిడతో ప్రేమగా వుంటూ ఏ కొంచెం సందేహం కలుగకుండా ఆమెకు నచ్చినట్లు మెలగాలని కూతురుతో అన్నాడు తండ్రి. అదెంత పని అలాగే చేస్తనంది ఎగిరి గంతేసినంత ఆనంద పడుతూ.

అత్తారింటికి పయన మయ్యింది. వాణి వాళ్ళ నాన్న చెప్పినట్లు ప్రతి రోజూ అత్తగారికిచ్చే పాలలో ఆ పొడిని కలుపుతూ ఇవ్వటమే కాకుండా ఎదురుమాట్లాడకుండా ఆమెతో ప్రేమతో ఉండ సాగింది. ఒక వారం రోజులు గడిచాయి. అత్తగారు కూడా తనపట్ల మునపటిలా కాకుండా కొంత ప్రేమతో ఉన్నట్లు గమనించింది.

ఇంకో వారం గడిచేటప్పటికి అత్తగారిలో చాలా మార్పు కన్పించింది. పెళ్లి రోజు వస్తుంది కదా ఏదైనా పట్టు చీర కొనుక్కొమ్మని, అలాగే అబ్బాయికి చెబుతాను బంగారు నెక్లెస్ కూడా తీసుకొమ్మని అత్త

గారు నాతో అనడంతో మూర్ఛ వచ్చినంత పనయ్యింది. ఆవిడేనా ఇలా మాట్లాడుతుందని ఒకింత ఆశ్చర్యం కలిగింది. మరో వారం రోజులు ఎలా గడిచాయో తెలియదు. నేనైతే రోజు క్రమం తప్పకుండా మా నాన్న ఇచ్చిన మందు పొడిని కలిపి ఇస్తూనే ఉన్నాను. కాకపోతే ఇంతకు ముందులా ఆమెపై ఉన్న కోపం గాని, పగకాని లేవు. ఈ లోగా మా అత్త గారు పక్కింటి వాళ్ళతో కోడలు గురించి మంచిగా- మాకు మంచి కోడలు దొరికిందని, తనను ఆవిడ బిడ్డ కంటే బాగా చూసుకుంటుందని మాట్లాడటం విన్న తరువాత వాణిలో ఒక్కసారిగా అత్తగారిపై మమకారం, ప్రేమ పుట్టు కొచ్చాయి. వెంటనే వాళ్ళ నాన్నకు ఫోన్ చేసి అత్తయ్య ఈ మద్య తనతో చాలా బాగా ఉంటుందని, ఆమెలో చాలా మార్పు వచ్చిందని, ఆమె చావ కూడదని ఎలాగైనా ఆమె మళ్లీ కోలుకునేందుకు, పూర్వంలాగా పూర్తిగా ఆరోగ్యంగా ఉండేందుకు ఏవైనా మందులు ఉంటే వెంటనే తీసుకొని రమ్మని కోరింది. కూతురులో వచ్చిన మార్పుకు ఆయన చాలా సంతోష పడుతు ఏమీ పర్వాలేదని, ఆమె ఆరోగ్యం విషయంలో దిగులు చెందాల్సిన పనిలేదని, ఇంకా శారీరకంగా ఆమె బలంగా అయి ఉంటుందని ఎందుకంటే తాను ఇచ్చిన పొడి విషపరమైనది కాదని, మల్టీ విటమిన్లు కలిగినదని జవాబు చెప్పాడు ఆర్. ఎం.పి. డాక్టర్ అయిన వాళ్ళ నాన్న.

కథ లోని విషయం అర్ధమయి ఉంటుంది. మంచికో, చెడుకో గాని వాణి మొదట ఆవిడ అత్త గారితో ప్రేమగా ఉండటంతో అత్తగారిలో కూడా మార్పు వచ్చింది.

బయటి వ్యక్తులు మారరని, వ్యవస్థ పాడైపోయిందని ఏడుస్తూ, తిడుతూ, శాపనార్థాలు పెడుతూ కూర్చోకుండా, మనలో ఏదైనా లోపం ఉందేమో, సవరించుకొని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉంటుందేమో అనే కోణంలో ఆలోచించి మార్పుకు శ్రీకారం మన నుండే మొదలు పెడితే వ్యవస్థలో కోరుకున్న అభివృద్ధి జరుగుతుంది. ఆశించినట్లుగా ఫలితాలు వస్తాయి.

## 5. ప్రధాన ఉపాధ్యాయుడుగా బాధ్యతలు చేపట్టినపుడు కొన్ని ప్రతి ప్రాదనలు ముందుంచు కోవాలి.

1. ఆ స్కూల్ లోనే శాశ్వతంగా ఉండే అవకాశం లేదు.
2. ఒకే సారిగా వెంటనే మార్పు తీసుకొని రావడం అసంభవం.
3. ప్రధాన ఉపాధ్యాయుడు కూడా సహచర ఉపాద్యాయుల లాగానే ఒక ఉపాధ్యాయుడు.
4. ఒక్కడిగా/ఒంటరిగా పని చేసి ఆశించిన లక్ష్యాలను సాధించడం అసాధ్యం.

అప్పుడు మీ ప్రవర్తన, దృక్పథం పనితీరుల్లో చాలా మార్పు వస్తుంది.

## మీరెలా స్పందిస్తారు

1. పాఠశాలలో పని చేసే ప్రధాన ఉపాధ్యాయుడు కూడా ఒక ఉపాధ్యాయుడే అన్న విషయంతో మీరు ఏకీభవిస్తారా? అయితే మీ అభిప్రాయాన్ని వివరించండి.
2. ప్రస్తుత కాలంలో సర్ జగదీష్ చంద్రబోస్ (ఈ వ్యాసం లో పేర్కొన్నట్లు) అనుసరించిన విధానం ప్రయోజనకరంగా ఉంటుందా? తెలియ జేయండి.
3. నాయకత్వం గురించి బరాక్ ఒబామా చెప్పిన మాటలను సమర్థిస్తారా? అయితే మీ సమర్ధతను విపులీకరించండి.
4. మీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన సందర్భంలో మీకు ఎదురైన సమస్యను ఎలా అధిగమించగలిగారో క్లుప్తంగా వివరించండి.